# "మనసుకో దాహం"

## — కొకాని కమల

''ఇంక నేవెళ్ళొస్తాను బాబుగారూ. బీరకాయలు పోపు వేశాను. ఉలవచారు కాచమన్నారుగా. కాచాను. కుంపట్లో వెచ్చగా నెగడు మీద పెట్టాను. పెంద్రాళే భోజనం చేసెయ్యండి.'' అంది రమణమ్మ వంటగది లోంచి ఇవతలకి వస్తూ.

తల ఊపాడు వీరాస్వామి.

''అలాగేకాని చిన్న మూతలో కాస్తకూర పెట్టుకుని నువ్వు తీసుకెళ్ళు'' అన్నాడు ఆపేక్షగా.

''ఎందుకు లెండి బాబుగారూ రోజూనూ. నాకు జీతం ఇస్తున్నారు కదా? మీ సొమ్ము మీకే వండిపెట్టటం ఏం కష్టం?'' అంది మొహమాటంగా.

''అదేమన్నమాట. నేను ఒక్కడ్ని. ఎంతని తింటాను?''

''వద్దు బాబూ. అందుకనే మిగలకుండా రెండు కాయలే తరిగి వండాను.'' అంది.

''పోనీ బీరకాయలు తీసుకెళ్ళు. నా పొలంలో కాసినవేగా. డబ్బుపోసి కొన్నవి కావు.'' అంటు బుట్టలోంచి నాలుగు కాయలు తీసి అందించాడు వీరాస్వామి.

మొహమాటంగా ఆకాయలు బిందెలో వేసుకుని ఇవతలకు వచ్చింది. మర్నాడు ఉదయం ఆబిందెతో చెరువు నీళ్ళు తెస్తుంది.

ఆమె వెనకాలే వీరాస్వామి ఇవతలకి వచ్చి ఇంటి ముందు అరుగుమీద కూర్చున్నాడు.

రవణమ్మ వెదురు గేటు తీసి తీగ బిగించి బిందె తీసుకుని వెడుతుంటే అలాగే చూస్తూ వుండిపొయ్యాడు.

నలుదిక్కులు మసక చీకట్లు ముసురుకుంటున్నాయ్.

ఆ మసక వెలుతురులో దూరం అవుతున్న రవణమ్మ కేసే చూస్తూ వుండిపొయ్యాడు.

రవణమ్మ వయసు నలభై రెండు. కురచగా కాస్త బొద్దుగా వుంటుంది. చామన ఛాయకంటె కొంచెం మెరుగైన రంగు. జుత్తు సన్నగా దువ్వి వేలుముడి వేసుకుంటుంది. అక్కడక్కడ తెల్ల వెంట్రుకలు కనిపిస్తున్నాయ్.

చేతికి తలా ఒక వెండిగాజు, మెళ్ళో వెండితో చుట్టిన పగడాల దండ. తెల్లటి మల్లు జాకట్టు, ముదర రంగు నేత చీర.

రవణమ్మకి ఇరవయ్యోఏట భర్త పోయాడు. భర్త నుంచి వచ్చిన ఆస్తంటు ఏది లేదు. ఒకటి అర అప్పులు మిగిల్చాడు భర్త. అత్తింటివారు వెళ్ళగొట్టేస్తే పుట్టింటికి వచ్చింది. తల్లి తండ్రి కాలం చేశారు. శివాలయం వెనక ధర్మచావడిలో నేలమాళిగ గదిలో ఉంటుంది.

చీకటితో లేచి శివాలయం చుట్టు ఊడ్చి మండపం కడిగి ముగ్గులు పెడుతుంది. తోటంతా తిరిగి పూలు కోసి బుట్ట నింపుతుంది. ఐదారు బిందెలు చెరువు నీళ్ళు తెచ్చి అభిషేకానికి సిద్ధం చేస్తుంది. ఈపన్లు చేసినందుకు డబ్బు తీసుకోదు. సత్రవుగది ఉచితంగా వాడుకుంటుంది.

ఊళ్ళో ఎవరికి అవసరం వచ్చినా పన్లు చేసిపెడుతుంది. వాళ్ళు సంతోషంగా ఇచ్చింది తీసుకుంటుంది. ఒక్కర్తి. ఏదో గడిచిపోతూంది.

వీరాస్వామిది అది స్వగ్రామం. ఊళ్ళో పొలాలు, చిన్న పెంకుటిల్లు ఉంది. అది తాత తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్థి. అవటానికి అది పుట్టి పెరిగిన ఊరే అయినా ఇన్నాళ్ళు దూరంగా ఉద్యోగరీత్యా పట్నంలో ఉండేవాడు.

ఈమధ్యనే అంటే ఐదారు నెల్ల క్రితం గ్రామం వచ్చాడు. ఊళ్ళో పొలం కౌలుకిచ్చాడు ఇన్నాళ్ళూ. ఇప్పుడు స్వంతంగా తనే చేసుకుంటున్నాడు. ఆ చిన్న పెంకుటింట్లో ఒక స్కూలు మాస్టరుగారు ఉండేవారు. వీరాస్వామి వచ్చాక ఆయన వేరే ఇల్లు చూసుకున్నారు.

వీరాస్వామికి యాభై రెండేళ్ళు.

ఆయన నలభయ్యవ ఏట భార్య వెంకటలక్ష్మి గతించింది. ఆరేళ్ళ క్రితం వాలంటరి రిటైర్‌మెంటు తీసుకున్నాడు వీరాస్వామి. రెండు వేలు పైచిలుకు పెన్షన్ వస్తుంది. పైగా ఊళ్ళో పొలంపై ఆదాయం వస్తుంది. ఇల్లుంది. మట్టినేల, పెంకుల నేత. ఒకపక్క నుంచి పుచ్చిపోతున్న కర్ర దూలాలు వాసాలు. అయితేనేం? చిన్నప్పుడు పుట్టి పెరిగానన్న ఆపేక్ష వీరాస్వామిది. అందుకే పట్నం బతుకు యాష్ట అనిపించి పల్లెకి కోరి వచ్చాడు.

వీరాస్వామికి ఐదుగురు సంతానం. ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. పెద్దకొడుకు కోడలు డాక్టర్లు. వాళ్లది ప్రేమ వివాహం. పట్నంలో నర్సింగ్ హోమ్ నడుపుతున్నారు. రెండు చేతులా ఆర్జన. వాళ్ళకి ముగ్గురు సంతానం.

రెండో కొడుకు కోడలు కూడా పట్నంలోనే ఉంటారు. రెండో కొడుకు ప్రొఫెసర్. కోడలు లెక్చరర్. వాళ్ళకి ఇద్దరు సంతానం.

మూడో కొడుకు ఇంజనీరు. కోడలు కంప్యూటర్సు చేసింది. ఇద్దరూ యు.ఎస్.ఏ. వెళ్ళారు. వాళ్ళకి ఒక కొడుకు. పెద్ద కూతురు అల్లుడు భిలాయ్‌లో ఉంటారు. కూతురు ఇంటిపట్టున ఉంటుంది. అల్లుడు స్టీలు ఫ్యాక్టరీలో చేస్తాడు.

రెండో కూతురు అల్లుడు విశాఖలో ఉంటారు. అల్లుడు హార్బర్‌లో పని. కూతురు ఇంటి పట్టున ఉండి బ్యూటీక్లినిక్ నడుపుతుంది. షెహనాజీ దగ్గర ట్రైనింగ్ అయి వచ్చింది. అదీగాక ఫ్యాషన్ షోలని, బ్యూటీకాంటెస్ట్‌లని క్లబ్స్ తరఫున నిర్వహిస్తూ ఉంటుంది. ఎప్పుడూ ఒకటే హడావుడి.

భార్యపోయాక వీరాస్వామి ఒంటరివాడు అయ్యాడు. పైగా ఉద్యోగరీత్యా ఊళ్ళు తిరగటం, నీళ్ళ మార్పు, హోటలు తిండివల్ల ఆయన ఆరోగ్యం కాస్త దెబ్బతింది. అందుకే వీరాస్వామిని కొడుకులు పోరుపెట్టసాగారు.

''ఇంకా ఎందుకు నాన్న ఉద్యోగం చెయ్యడం, అనవసరంగా శ్రమపడటం. మనకి ఏం తక్కువని? మేం సంపాయిస్తున్నాం చాలదా? హాయిగా వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకో. మాదగ్గరకి వచ్చి ఉండు. నీకెన్ని సౌకర్యాలు కావాలో చెప్పు. చేస్తాం.'' అన్నారు మనస్ఫూర్తిగా.

అదీ నిజమే అనిపించింది వీరాస్వామికి. మనిషి డబ్బు సంపాదించేదెందుకు? సుఖపడటానికి.

భార్య పోయాక ఒంటరితనం, చెయ్యి కాల్చుకోవటం విసుగనిపించింది. ఇంక ఆరేళ్ళ పైచిలుకు సర్వీస్ వుండగానే వలంటరి రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. పూర్తి సర్వీస్ చేస్తే ఎంత వస్తుందో అంత వచ్చింది.

''నీ పేర్న వుండనీ నాన్న. ఆ డబ్బుతో మాకేంపని.'' అన్నారు కొడుకులు. అదీగాక నెలకి రెండువేల ఐదు వందలు పెన్షన్ వస్తుంది. ఆ డబ్బు కూడా కొడుకులెవరు ముట్టుకోలేదు.

''నీ డబ్బు నీవు హాయిగా ఖర్చుపెట్టుకో నాన్న. లేకపోతే బ్యాంకులో దాచుకో. అది నీ కష్టార్జితం. మాకేం తక్కువుందని?'' అన్నారు.

రిటైర్ అయ్యాక పెద్దకొడుకు ఇంట్లోనే ఉన్నాడు. కొడుకు కోడలు డాక్టర్లు. ప్రైవేట్ నర్సింగ్ హోమ్ నడుపుతున్నారు.

కింద హాస్పటల్, పైన ఇల్లు. ఇంటి చుట్టు మంచి గార్డెన్. వంటమనిషి, పనిమనిషి, పైపన్లకి కుర్రాడు, తోటమాలి వున్నారు. వీరాస్వామి కాలు కిందపెట్టే పని లేదు. అంత సౌకర్యం. నర్సింగ్ హోమ్‌లోని ఇన్‌పేషంట్స్‌కి ఉదయం సాయంత్రం రౌండ్స్‌కి వెళ్ళినట్లే కొడుకు తండ్రిని కూడా రెండు పూట్ల ఆరోగ్యం గురించి శ్రద్ధగా పరామర్శించేవాడు. కోడలు కూడా ఇంట్లోవున్న కాస్సేపు ''మావయ్యా'' అంటూ చాలా ప్రేమగా వుండేది. అయితే చిక్కల్లా కొడుకు కోడలు ఇంట్లో వుండే ఘడియలే తక్కువ. వాళ్ళిద్దరివి బిజీ షెడ్యూల్. పగలు రాత్రి డ్యూటి చేసే వృత్తి. నగరంలో పేరుపొందిన డాక్టర్లు కావడంతో కన్నపిల్లల్తోనే ఎక్కువ సమయం గడపలేకపోయేవాళ్ళు.

ఇంక తీరుబడిగా వున్న తండ్రి గురించి ఎంత ఆలోచిస్తారు. 'ఆయనకి అన్ని సౌకర్యాలు చేశాం. ఆయన డబ్బు ముట్టుకోటంలేదు. ఆయనకేం తక్కువ. హాయిగా వుండచ్చు.' అనుకున్నారు. కాని ఆ 'హాయి' వీరాస్వామికి నచ్చలేదు.

బిడ్డలకి దూరంగా ఉద్యోగం వూళ్ళో వున్నపుడు ఎలాంటి ఒంటరితనం అనిపించిందో ఇప్పుడూ అంతే అనిపించింది. పోనీ మనుమలతోనన్నా కాలక్షేపం చేద్దాం అంటే వాళ్ళది అంతకంటే బిజీ షెడ్యూల్.

ఉదయం లేచింది మొదలు కాన్వెంటుకి వెళ్ళే హడావుడి. సాయంత్రం వచ్చాక వంటావిడ పెట్టిన టిఫిన్ తిని ట్యూషన్‌కి వెళ్ళేవారు. అందుకే వాళ్ళు మంచి కంపెనీ కాలేకపొయ్యారు వీరాస్వామికి. వీరాస్వామి పెద్దరికంగా ఏదన్న చెప్పబోయినా ''అదంతా ఓల్డ్ తాతయ్యా.'' అనేవారు. ఒకరి మొఖాలు ఒకరు చూసుకుని పకపక నవ్వేసేవారు.

రెండో కొడుకు ఇంటికి వచ్చినా అక్కడా ఇదేగోల. పగలంతా కొడుకు కోడలు ఉద్యోగాలు. సాయంత్రం ఆలస్యంగా ఇంటికి వచ్చేవారు. స్థానికంగా వున్న ట్యుటోరియల్స్‌కి, కోచింగ్ సెంటర్లకి వెళ్ళి అక్కడ ఒకటి రెండు గంటలు పార్ట్‌టైమ్ చేసేవారు. ఇంకా పరీక్ష పేపర్లని, నోట్సుని, గైడ్సు తయారు చెయ్యటం అని... ఇంటికి వచ్చి కూడా బిజీగా వుండేవారు. పిల్లలు డిటో.. చదువు, పరీక్షలు, ట్యూషన్లు, టి.వి., ఆటలు... అంతే.

వీరాస్వామికి రెండో కొడుకు కోడలు కూడా ఏం తక్కువ చెయ్యలేదు. సకల సౌకర్యాలు చేశారు. ప్రత్యేక గది ఇచ్చారు. తండ్రి డబ్బు ముట్టుకోలేదు సరికదా ఎదర వాళ్ళు చేతి ఖర్చులకు డబ్బిచ్చారు.

''మీరు నాకివ్వటం ఏమిట్రా. నేను మీ ఇంట్లో వుంటున్నాను కదా. నేను ఎవరింట్లో వుంటే వాళ్ళు నా పెంక్షన్ వాడుకోండి.'' అని డబ్బివ్వబోతే ఏ కొడుకు,



కోడలుం తీసుకోలేదు.

''మీ తిండి మాకు ఎక్కువ కాదు నాన్న. ఆ డబ్బు మీదగ్గరే వుండనివ్వండి'' అనేవాళ్ళు కొడుకులు. కోడళ్ళు వంత పాడేవారు ప్రేమగా.

మనవళ్ళు 'తాతయ్య' అంటు ప్రేమగానే వుండేవారు. కాని వాళ్ళు ఈకాలం పిల్లలు. తాతయ్య ఆకాలం పద్ధతులకి సరిపడేది కాదు. వాళ్ళకి అస్తమానం టి.వి. కామిక్‌షోలు, కార్టూన్ ఫిల్మ్, వీడియోగేమ్స్. అదీగాక పోతే డిష్యుం డిష్యుం ఫైటింగ్ సినిమాలు.

అవన్నీ వీరాస్వామికి తలనొప్పి తెప్పిస్తాయి.

ఆయనకి చక్కగా కబుర్లు చెప్పే వాళ్ళు కావాలి. ఆయన ఒంటరితనాన్ని పోగొట్టి మనసున మనసై కబుర్లు చెప్పే వాళ్ళు కావాలి. స్నేహం పంచేవాళ్ళు కావాలి.

అసలు కాలం మారింది. కంప్యూటర్ యుగం. లేచింది మొదలు పరుగులు. చిన్నపిల్లల దగ్గర్నుంచీ పెద్దల దాకా మెకానికల్ జీవితం. ధనార్జనే ధ్యేయం.

అన్ని అయి కాళ్ళు చాపుకుని కూర్చున్నవాడు వీరాస్వామి. తీరుబడిగా ముచ్చట్లాడే మనిషి ఎక్కడ దొరుకుతాడు. పెళ్ళాం బతికుంటే బాధ వుండకపోను.

కూతుళ్ళ ప్రేమ ఒలకపోస్తు ఉత్తరాల మీద ఉత్తరాలు రాస్తే వెళ్ళాడు.

కాని అక్కడ పట్టుమని పది దినాలు కూడా వుండలేకపోయాడు.

కూతుళ్ళకంటే కొడుకులు, కోడళ్ళు ఎంతో నయంగా అనిపించారు.

## కాజోల్ కబుర్లు



''పెళ్ళి గురించి మీ అభిప్రాయం చెప్పండి'' అంటే కాజోల్ సిగ్గు పడకుండా ఇలా చెప్పింది. ''పెళ్ళి అనే పదానికి ప్రతి మనిషి జీవితంలోనూ ఒక ముఖ్యస్థానం ఉంది. రెండు ఆత్మల కలయికే పెళ్ళి. సరయిన జోడీ దొరికితే అదో తియ్యని అనుభవం.'' ''మరి మీ జీవితంలో తీరని కోరిక ఏదైనా ఉందా?'' అంటే ''కంప్యూటర్స్ గురించి పూర్తి జ్ఞానం సంపాదించాలనే కోరిక నాకుండేది. అసలు నా రూమ్‌లో ఎటు చూసినా కంప్యూటర్స్ ఉండాలని నేను కలలు కంటుండేదాన్ని. అయితే ఈ సినిమాల్లో పడ్డాక ఆ కోరిక తీర్చుకునే అవకాశమే లేకుండాపోయింది...'' ''మరి చివరి ప్రశ్న- అజయ్ దేవగన్‌తో మీ పెళ్ళి ఎప్పుడు జరగొచ్చని మీరు అనుకుంటున్నారు.'' అన్న ప్రశ్నకు జవాబుగా ''పెళ్ళితోనే సినిమా కెరీర్ అంతం అవుతుంది కాబట్టి, మా పెళ్ళి కాస్త ఆలస్యంగానే జరుగుతుంది.'' అంటూ చెప్పుకొచ్చింది... ఇదంతా బాగానే ఉందిగానీ, అజయ్‌దేవగన్ ప్రస్తుతం ట్వింకిల్‌ఖన్నాతో జోరుగా హుషారుగా షికార్లు కొడుతున్నాడని వినికిడి. ట్వింకిల్ అసలే ఫాస్ట్‌గర్ల్! మరి ఆలస్యంగానయినా కాజోల్ పెళ్ళి అజయ్‌తో జరుగుతుందా?! దేవుడికే తెలియాలి!

- జె.వి. బాబు

కూతుళ్ళ ప్రేమ తన మీద కాదు. తన డబ్బు మీద. వీరాస్వామికి ఉద్యోగంలో వచ్చిన డబ్బు, నెలనెలా వచ్చిన పెంక్షన్ ఆయన స్వార్జితం.

తండ్రి స్వార్జితం మీద కూతుళ్ళకి హక్కుంది. ఆ హక్కు దక్కించుకోవాలన్న తాపత్రయం అడుగడుగునా వీరాస్వామికి కనిపించింది. అందుకే వాళ్ళు చూపించే ప్రేమ వెగటనిపించింది. వుండలేకపొయ్యాడు.

ఆ పట్నపు జీవితం, పరుగులు ఆయనకి రుచించలేదు. హోటలు తిండివల్ల ఏర్పడిన స్వల్ప అనారోగ్యం తప్పించి చెప్పుకోదగ్గ రోగం అంటు ఏదీ లేదు వీరాస్వామికి. మనిషి రాయిలా ఉన్నాడు. అందుకే స్వంత గ్రామం వెళ్ళటానికి నిర్ణయం చేసుకున్నాడు. మట్టి ఇల్లు బాగుచేయించుకుని, పొలం పన్లు స్వయంగా చూసుకుంటూ కావాల్సినంత కాలక్షేపం. తృప్తి.

రమణమ్మ మరీ భొత్తిగా పరిచయం లేని మనిషి కాదు. వాళ్ళ నాన్నగారు కొన్నిరోజులు వీరాస్వామికి చదువు చెప్పారు. అప్పుడు రమణమ్మ బాగా చిన్నపిల్ల.

శివాలయం వెళ్ళినపుడు పూజారిగారు రమణమ్మ గురించి చెప్పి ''వీరాస్వామి! నీవు ఒంటరిగా వుంటున్నావు. స్వయం పాకం అవసరం లేదు. నీక్కావాలంటే రమణమ్మ రెండు పూటలా వచ్చి వండిపెడుతుంది. ఏదో నీకు తోచింది నెలకింత అని ఇయ్యి. పేదరాలికి సాయం చేసినట్టు వుంటుంది.'' అన్నారు.

అప్పట్నుంచి రమణమ్మ వచ్చి రెండు పూటలా వండిపెడుతుంది. ఉదయాన్నే బిందెతో చెరువునుంచి తాగటానికి నీళ్లు తెస్తుంది. పెరట్లో బావు వుంది. వంటగది శుభ్రంచేసి దేముడి మందిరం కడిగి ముగ్గు పెడుతుంది. ఆ కబురు ఈ కబురు చెప్తూ వంటిల్లు సర్దుతుంది.

''పాతికేళ్ళకే నాకొడుకుని మింగేశావ్ అంది బాబుగారూ మా అత్త. ఏ ఆడదైనా తన పసుపుకుంకం వెయ్యేళ్ళు వుండాలి అనుకుంటుందిగాని పెళ్ళయిన నాలుగో రోజే తాళిబొట్టు పోవాలి అనుకుంటుందా బాబుగారూ? మీరే చెప్పండి?'' అంటుంది రమణమ్మ అమాయకంగా.

''ఎలా అనుకుంటుంది రమణమ్మ? నా పెళ్ళాం చచ్చిపోవాలని నేను అనుకున్నానా? ఇప్పటికీ దాన్ని జ్ఞాపకం చేసుకుంటాను.''

''నేనూ అంతే బాబుగారూ! మాఆయనే బతికుంటే నా బతుకింత నిండుగా వుండేదో కదా? నూనవ్రతానికి నోచుకోకపోయినా పచ్చగా పసుపు రాసుకుని చిటికెడు కుంకుమ పెట్టుకుంటే ఎంత బావుంటుందో అనిపిస్తుంది.'' అంటుంది.

రమణమ్మ ఇంకాసేపు కూర్చుంటే బాగున్ను అనిపిస్తుంది వీరాస్వామికి. రమణమ్మకి అంతే.

కాని లోకం అంటు ఒకటుంది కదా?

గ్రామం వచ్చాక వీరాస్వామి ఒంటరితనం అన్న మాట మర్చిపోయాడు. పగలంతా పొలం పన్లు. ఉదయం సాయంత్రం వంట చెయ్యడానికి వచ్చే రమణమ్మతో మంచి ఊసులు. ఇద్దరు గతస్మృతులు నెమరు వేసుకుంటారు.

పిల్లలు చుట్టాలు ఇరుగు పొరుగు ఎందరున్నా ఒకరికొకరన్నట్లు మనసున మనసై బతికేది ఆలుమగలే.

కాని వీరాస్వామికి రమణమ్మకి మధ్య పరిచయం పెరిగి సాన్నిహిత్యం హెచ్చుతున్నకొద్దీ ఒకరికొకరు ఆత్మీయంగా మనసుకి దగ్గరిగా రాసాగారు. ఒకరికొకరు మనసు విప్పి కష్టం సుఖం మాట్లాడుకుంటున్నారు.

''రేపేం చెయ్యమంటారు బాబుగారూ'' అంటుంది ఆపేక్షగా.

''రేపు శనివారం. మీకు రాత్రికి ఇడ్లికి పప్పు నానబొయ్యనా? లేక చపాతీలు చెయ్యమంటారా?'' అంటుంది.

వీరాస్వామి తనకి కావాల్సింది శుబ్బరంగా చెప్పి వండించుకుంటాడు. సుష్టుగా తిని బ్రేవ్‌మని తేనుస్తాడు.

''రవణమ్మ, నాకు పదిహేనెకరాల పొలం వుంది. నెలనెలా రెండున్నర వేలు పెన్షన్ వస్తుంది. అది తూచి నా ఒక్కడికే బొటాబొటిగా వండక్కర్లేదు. ఏం వండినా ఇద్దరికి సరిపడ వండు. నీవు ఇక్కడే తిన్నా సరే. లేదూ ఇంటికి తీసుకెళ్ళినా సరే.'' అంటాడు.

''నెల జీతం ఇస్తున్నారు కదా బాబూ'' అంటుంది బిడియంగా.

''ఇస్తే. ఏం వేలకి వేలు ఇస్తున్నానా? నీ తిండివల్ల నా ఆస్తి తరిగిపోదు.'' అంటాడు.


ఇద్దరూ కల్సి ఫలహారం చేస్తారు. ఆ తరువాత ఎంగిలి పళ్ళాలు ఎత్తి వంటగది శుభ్రం చేసిపెడుతుంది.

ఎప్పుడైనా కాస్త ఒంట్లో నలత చేసి రవణమ్మ రాకపోతే వీరాస్వామికి ఎంతో వెల్తిలా అనిపిస్తుంది.

వీరాస్వామికి కాస్త తలనొప్పి వచ్చినా రవణమ్మ తెగ ఖంగారు పడుతుంది.

• • •

పల్లెకి వచ్చినప్పట్నుంచి వీరాస్వామికి జీవితంలో



గొప్ప మార్పు కనిపిస్తుంది. ఆయన వయసు యాభై రెండు దాటింది. కాని పాతికేళ్ళు వెనక్కి వెళ్ళినంత ఉత్సాహంగా ఉంది. మనసు ఎంతో ఉల్లాసంగా ఉంది. ఇన్నాళ్ళూ వేధించిన ఒంటరితనం దూరం అయ్యింది. మనసుకి తోడు దొరికింది. భార్య బతికున్న రోజుల్లో మనసు ఎలా ఉండేదో అలా ఉంది. తన మనసుకి దొరికిన తీగ రవణమ్మ.

కాని ఆయనకి ఇంకో చింత పట్టుకుంది.

ఆ చింతకి కారణం... అనుక్షణం వీరాస్వామి మనసు ఇంకోరకంగా ఆలోచిస్తుంది. ఊహూ... ఆశలు పడుతూంది.

రవణమ్మకి భర్తలేడు. ఏ సౌభాగ్యానికి ఆమె నోచుకోలేదు. చిన్న వయసులోనే అన్ని పోగొట్టుకుంది. పైగా పేదరాలు. చచ్చేదాకా చాకిరి చేస్తేనే నోట్లోకి మెతుకు పోతుంది. చచ్చాక తలకొరివి పెట్టటానికి కూడా ఊళ్ళో నలుగురు తలా చెయ్యి వెయ్యాల్సిందే.

తనకా భార్యలేదు. అందరూ ఉన్నారు. వయసు యాభై దాటింది. తనకీ కావాల్సినంత డబ్బుంది. తనకీ వయసులో ఆసరా కావాలి. అది తన కొడుకులు దగ్గర కూడా బోల్డంత లభిస్తున్నది. కాని అక్కడ తన మనసుకి సంతోషంగా లేదు. తృప్తి లేదు. కడుపుకు ఆహారం ఎలాగో మనసుకి సంతోషం అంతే.

తన భార్య రవణమ్మకంటే నాలుగేళ్ళు పెద్ద. రవణమ్మని తను పెళ్ళి చేసుకుంటే ఎలా ఉంటుంది?

''లోకం హర్షిస్తుందా?'' అన్న చింత పట్టుకుంది. ఈ పెళ్ళివల్ల, తన వల్ల, రవణమ్మకి ఎక్కువ అన్యాయం ఏమి జరగదా అనిపిస్తుంది. తనకంటే చిన్నవాడైతే రవణమ్మకి తగిన న్యాయం జరుగుతుంది. కాని ఆమెని ఎవరు చేసుకుంటారు. ఆమెకి మళ్ళీ పెళ్ళి జరగాలంటే ఈపాటికే జరగాలి. జరగలేదు. ఇకపై జరగదు. తను చేసుకుంటే హాయిగా ఇంత ఇల్లు వాకిలి, నీడ పట్టున మంచి బ్రతుకు వస్తాయి. ఇల్లిల్లు తిరిగి చాకిరి చెయ్యనవసరం లేకుండా కడుపునిండా తిండి బట్ట ఒక హోదా వస్తుంది. తనకి ఇంట్లో దీపం పెట్టే మనిషి వస్తుంది.

ఒకరకంగా ఇద్దరికి పెళ్ళి-సంసారం వయసు దాటిపోయింది. ఈ వయసులో స్త్రీకిగాని పురుషుడికిగాని కావల్సింది శృంగారం కాదు. ఒకరికొకరు తోడు-నీడ. మనిషికి మనిషి ఆసరా. కష్టం సుఖంలో పాలుపంచుకునే స్నేహం. తన భార్య బ్రతికివున్నా ఈ వయసులో ఆమె నుంచి తను ఇవ్వే కోరుకునేవాడు. రవణమ్మ భర్త బ్రతికున్నా ఆమెకి ఆయన్నుంచి అవ్వే లభ్యం అయ్యేవి.

తను రవణమ్మని చేసుకుంటే ఆమెకు జీవితంలో కొంతైనా న్యాయం జరుగుతుందికదా?

ఇక లోకం...

కొత్తలో నాలిక బయట పెడుతుంది. ముక్కున వేలుంచుకుంటుంది. ఆ తరువాత మర్చిపోదా? తనకి వారసత్వంగా వచ్చిన ఆస్తి కొడుకుల పేర్న రాస్తాడు. తన కష్టార్జితంగా వచ్చిన డబ్బు, పింఛను తను వాడుకుంటాడు. ఈ చిన్న పెంకుటిల్లు తనకింద వుంచుకుంటాడు. తన తదనంతరం రవణమ్మకి చెందుతాయి.

ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా తనకి లక్ష్యం లేదు. ముందు రవణమ్మకి చెప్పాలి. ఆమె ఒప్పుకుంటే చాలు.

ఈ వయసులో రవణమ్మకి పిల్లలు పుట్టకపోవచ్చు. ఒకవేళ కాలంగాని కాలంలో కాపు కాసినా తన బ్యాంకులోవున్న నాలుగున్నర లక్షలు, ఈ చిన్నఇల్లు, పింఛను ఆ పసికందుకి వారసత్వంగా లభిస్తాయి.

ఇంతకీ రవణమ్మ ఏమంటుందో?

లోకానికి భయపడుతుంది తప్పించి ఆమెకు ఎంతో ఇష్టం వుండదా? పసుపు కుంకం దొరుకుతాయంటే ఏ ఆడది సంబరపడదు? ఆమె ఇన్నేళ్ళు ఒంటరి ఎడారి పయనంలో ఒక మగతోడు ఒక ఆసరా లభిస్తుంటే వద్దంటుందా?

తను కన్ను మిన్ను కానని కామంతో ఈపని చెయ్యడంలేదు. అదే యదార్థం అయితే ఈపాటికి ఎప్పుడో ఈపని చేసి వుండేవాడు.

అలాగే రవణమ్మ గ్రామంలో ఏదో తప్పుడుపని చేస్తే ఊర్నించి తరమకొట్టబడి వుండేది. కాని ఆమె నిజాయితి నీతిమంతతనం చూసే శివాలయంలో స్థానం ఇచ్చారు.

రేపు రవణమ్మ వచ్చినపుడు అడగాలి. దేముడి పూజామందిరం ముందు కూర్చోమని చెప్పి అడగాలి. ఖంగారు లేకుండా స్థిమితంగా ఆలోచించుకోమని చెప్పాలి. రవణమ్మ ఒప్పుకుంటే అప్పుడు కొడుకులకి చెప్పాలి. వాళ్ళంతా చదువుకున్నవాళ్ళు. ఈ చివరి రోజుల్లో తనకేం కావాలో వాళ్ళకి తెలుసు. అర్థం చేసుకుంటారు.

వాళ్ళు కాదన్న ఆగేది ఏంలేదు. ఎవరి జీవితం వాళ్ళ ఇష్టం. తనకి రవణమ్మ అభిప్రాయం ముఖ్యం. తను ఈమాట చెప్పగానే రవణమ్మ ముఖం ఆనందంతో ఎంత వెలిగిపోతుందో?

కళ్ళకి కాటుక పెట్టుకుని నుదుట కుంకుమ దిద్దుకుని సిగలో పూలు పెట్టుకుంటే రవణమ్మ ఎంత కళగా వుంటుందో...

బిందె తీసుకుని దూరంగా సందు మలుపు తిరుగుతున్న రవణమ్మని చూస్తూ అలాగే అరుగు మీద కూర్చుండిపోయాడు వీరాస్వామి.

అప్పటికే మసక చీకట్లు బాగా దట్టంగా ముసురుకుని చుట్టూ చీకటి ఆవరించింది.

కాని వీరాస్వామి మనసులో దీపం వెలుగుతూంది.

''మళ్ళున్నా మాణ్యాలున్నా-మంచె మీద మగువుండాలి

పాడి వున్నా పంటలు ఉన్నా- పంచుకునే మనిషుండాలి''-

టూరింగ్ టాకీస్‌లో సినిమా మారినట్లుంది. సినిమా బండివాడు లౌడ్‌స్పీకర్లో పాటలు వేస్తూ, పేపర్లు పంచుతున్నాడు.

★

## సంతానమంతా జడ్జీలే!



ఒక జడ్జీగారి సంతానమంతా జడ్జీలే. జర్మనీకి చెందిన శామేనీ నగరంలోని ఒక కోర్టులో బెండిక్ట్ కార్ల్సజోన్ అనే ఆయన జడ్జీగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. కార్ల్సజోన్‌కు ఐదుగురు మగ సంతానం. ఈ అయిదుగురు కూడా న్యాయాధిపతులు అవ్వటమే కాక తండ్రి ఏ కోర్టులో అయితే జడ్జీగా పనిచేశాడో అదే కోర్టులో పనిచేయటం గొప్ప విశేషం కదూ!

## ప్రాకుతూ వెళ్ళే వాకిళ్ళు

ఆఫ్రికాకు చెందిన బాంగో అన్న ఆదిజాతివాసుల ఇళ్ళు గుడిసెల ఆకారంలో వుండి వాకిళ్ళు మాత్రం చాలా చిన్నవిగా వుంటాయి. అందువలన ఇంట్లోకి వెళ్ళాలన్నా, ఇంట్లోంచి బయటకు రావాలన్నా వీరు నేలపై ప్రాకుతూ లోపలికి వెళ్ళటం లేదా రావటం చేయాలి. పరిశోధకులు మాత్రం వీరు యిలా ఇళ్ళు నిర్మించుకోవటానికి కారణం ఎండవేడి, వడగాడ్పులు, తీవ్రమైన గాలి నీటినుండి వీరు రక్షణ పొందటానికే యిలా ఇళ్ళు నిర్మించుకుంటున్నారని తెలియజేస్తున్నారు.

## నదికి శిక్ష విధించిన ప్రభువు

పర్షియా సామ్రాజ్య స్థాపకుడైన 'సైరస్' అనే ప్రభువు ఒకసారి బాగా కోపం రావటంతో నదికి శిక్ష విధించాడు. అతని ప్రియాతి ప్రియమైన గుర్రాలు ఈ నదిని దాటుతూ ప్రవాహ వేగానికి కొట్టుకుపోయి జాడ తెలియకపోవటంతో ఆ నదిని ఎలాగైనా శిక్షించాలని భావించి అఘమేఘాలమీద తన సైన్యాన్ని రంగంలోకి దింపి నదిని పాయలు పాయలుగా చేసి పారేశారు. పాపం ఆ దెబ్బతో ఆ నది అడ్రస్ లేకుండా నదిలో ఇంకిపోయింది మరి. మరలా వెయ్యి సంవత్సరాల తర్వాత ఆ నేలపై ఆ నది ప్రవహించగలిగింది.

-శ్రీకొండ (యెర్రబోడు)